సాక్షి
విజయనగరం

శనివారం । 27 । మే । 2023



సాహితీ వేత్తలకు వందనం

ఒక అక్షరం అనంత విశ్వానికి వెలుగు. ఒక ప్రయత్నం కోట్ల ఫలితాలకు తొలిమెట్టు. చిన్నపాటి ఆలోచన..శతసాహితీ మాసోత్సవాల కార్యక్రమానికి వారధిగా నిలిచింది.

- 10లో



మాతా, శిశు మరణాలను అరికట్టాలి

మహిళలు గర్భం దాల్చిన నాటినుంచి ప్రసవం జరిగే వరకు నిత్యం పర్యవేక్షించాలని తద్వారా మాతా, శిశు మరణాలను అరికట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు.

- 10లో

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: జిల్లా క్షయ నివారణశాఖలో ఖాళీగా ఉన్న సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ (ఎస్‌టీఎస్), సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ పోస్టులు-2, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు-4కి సంబంధించి ఫైనల్ మెరిట్ జాబితా విజయనగరం. ఎన్ఐసీ.ఇన్‌లో పొందుపరిచినట్టు జిల్లా క్షయ, ఎయిడ్స్, లెప్రసీ అధికారి డాక్టర్ ఎన్.సూర్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయ. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో జాబితాను చూసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

పశువుల అక్రమ రవాణపై కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యకళ

విజయనగరం ఫోర్ట్: అనుమతులు లేకుండా పశువులను రవాణ చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ సూర్యకళ హెచ్చరించారు. విజయనగరం ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించి న జంతు సంక్షేమ కమిటీ డివిజనల్ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. పశు అక్రమ రవాణను అరికట్టేందుకు మండల స్థాయిలో ఎస్‌హెచ్ఓ, తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో కమిటీలను పటిష్ఠ పరిచి పర్యవేక్షిస్తామన్నారు. ఏపీ గోసంవర్ధక కమిటీ అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ సంతల్లో పశువుల కోసం కనీస సౌకర్యాలు ఉండడంలేదని, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు. వీధి కుక్కలను చంపకుండా... యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం ద్వారా వాటి సంతతిని నిరోధించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ సూచించారు. గోవధను నిరోధించాలని సోంబాబు కోరారు. సమావేశంలో డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీఎల్‌పీఓ మోహన్‌రావు, తహసీల్దార్ బంగార్రాజు, పశు సంవర్ధక శాఖ డీడీ రామచంద్రరావు, సీఐ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

66 రైతుబజార్లలో పైనాపిల్ విక్రయం

- డీహెచ్ఓ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న డీహెచ్ఓ సత్యనారాయణరెడ్డి

సీతంపేట: ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని 66 రైతు బజార్లలో పైనాపిల్ విక్రయానికి అనుమతులు తీసుకున్నట్టు జిల్లా ఉద్యానవన అధికారి (డీహెచ్ఓ) సత్యనారాయణరెడ్డి తెలిపారు. సీతంపేట ఐటీడీఏలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఎన్జీఓలు, పైనాపిల్ రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు పైనాపిల్ రవాణా చేసే రైతులు ఈ నెల 27 నుంచి ఐటీడీఏలోని ఉద్యానవనశాఖ ద్వారా అనుమతులు తీసుకోవచ్చన్నారు. రైతు సంఘం బ్యాంక్ పాస్‌బుక్, రైతు ఆధార్, పాస్ ఫొటో తీసుకురావాలన్నారు. విక్రయాల్లో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. అందరూ ఒకే దగ్గర కాకుండా ఒక్కో రైతు ఒక్కో రైతు బజారుకు వెళ్లి అమ్ముకునేలా అనుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం సంధ్యారాణి, మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, వైకేపీ ఏపీడీ రమణ, హెచ్ఓలు ఆయంతి, అమరేశ్వరి పాల్గొన్నారు.

పనుల నాణ్యతలో రాజీపడొద్దు



రేగిడి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు చెబుతున్న రైమ్స్‌ను శ్రద్ధగా వింటున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: నాడు-నేడు పనుల నాణ్యతలో రాజీపడొద్దని కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచించారు. పాఠశాలలను ఆహ్లాదకరంగా, విజ్ఞానదాయకంగా ముస్తాబు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని, అంతే ప్రాధాన్యతగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని మేదరగండ, రేగిడి గ్రామాల్లోని పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. రేగిడిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ల్యాబ్‌లో చేపడుతున్న వైద్య పరీక్షలు, పరికరాల పనితీరు, మందుల నిల్వలపై ఆరా తీశారు. గర్భిణుల వార్డును తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవాభావంతో వైద్యసేవలందించాలని, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని వైద్యసిబ్బందికి సూచించారు. రేగిడిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులతో రైమ్స్ చెప్పించారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి కె.విజయగౌరి, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

ఉద్యోగ యజ్ఞం

- నియోజకవర్గానికో స్కిల్ హబ్
- నచ్చిన కోర్సుల్లో ఉచిత శిక్షణ
- చదువుపూర్తికాగానే వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు
- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అండగా జగనన్న సర్కారు
- మారిన ఉద్యోగ సరళి
- అందివస్తున్న అంతర్జాతీయ అవకాశాలు
- ఆనందంలో విద్యార్థిలోకం

విజయనగరం డెస్క్:

విద్యార్థుల చదువుకు సార్థకత చేకూర్చాలన్నది ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా విద్య, ఉద్యోగ సంస్కరణలు చేపడుతోంది. కొత్తకొత్త ఆలోచనలు చేస్తోంది. అంతర్జాతీయ అవసరాలను, అవకాశాలను గుర్తించి విద్యా, ఉద్యోగ ప్రణాళికలు రూపొందిస్తోంది. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు సాధించేలా, స్వయం ఉపాధి పొందేలా విద్యార్థులు, నిరుద్యోగులకు ఏపీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తోంది. వివిధ కంపెనీల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్దే బృహత్తర క్రతువును నిర్విఘ్నంగా సాగిస్తోంది. దీనికోసం నియోజకవర్గానికో స్కిల్‌హబ్‌ను ఏర్పాటుచేసింది. కంపెనీల ప్రతినిధులే నేరుగా వచ్చి మానవవనరులను ఎంపిక చేసుకునే అవకాశాన్ని విద్యార్థి, నిరుద్యోగలోకానికి చేరువచేసింది. విజయనగరం పార్వతీపురం మన్యం జిల్లాలోని స్కిల్‌హబ్‌లో ఇస్తున్న శిక్షణ, నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాలు నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. అర్హతకు తగిన ఉద్యోగాలు లభించి ఆనందం నింపుతున్నాయి.



విజయనగరం ప్రభుత్వ ఐటీఐలోని స్కిల్‌హబ్‌లో సాగుతున్న ఉద్యోగసాధన శిక్షణ

సిల్క్‌హబ్‌ల సంఖ్య:

విజయనగరం: **9** పార్వతీపురం మన్యం: **4**

స్కిల్‌హబ్‌లలో శిక్షణపొంది మూడునెలల్లో ఉద్యోగాలు సాధించిన వారి సంఖ్య: **419** మంది



నాడు: సాధారణ డిగ్రీ కోర్సుల అభ్యసన. వృత్తి నైపుణ్యాలు అంతంతమాత్రమే. కంపెనీల్లో చేరాలంటే తెలిసిన వారి కాళ్లు పట్టుకోవాలి. ఖాళీలు తెలుసుకోవాలి. ఇంటర్వ్యూకు వెళ్లేందుకు వ్యయప్రయాసలకోర్చాలి. ఉద్యోగం వస్తుందోరాదో తెలియదు. నైపుణ్యం లేక ఉద్యోగాల నుంచి వైదొలగాల్సిన దుస్థితి. ఏమి చేయాలో తెలియక.. సమయం వృథా అయ్యేది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టేవి. చదువుకు తగిన ఉద్యోగం రాక.. చివరకు బతుకుదెరువుకు ఏదో రంగంలో స్థిరపడాల్సిన పరిస్థితి.

నేడు: ఏపీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వివిధ వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ. దీనికోసం ప్రతినియోజక వర్గంలో అందుబాటులో ఉన్న స్కిల్‌హబ్. వివిధ కంపెనీల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక తర్ఫీదు. సాంకేతిక విద్యపై సంపూర్ణ అవగాహన. కళాశాలలు, స్కిల్ హబ్‌లలో విరివిగా జాబ్‌మేళాలు.. పేరొందిన కంపెనీల్లో అర్హతకు తగిన ఉద్యోగాలు ఎంపిక చేసుకునే సదావకాశం.. చిన్నవయసులోనే ఉద్యోగాల్లో స్థిరపడేందుకు.. అంతర్జాతీయ అవకాశాలు అందిపుచ్చుకునేందుకు చక్కని ప్రోత్సాహం... విద్యార్థి, నిరుద్యోగుల్లో ఉద్యోగ ఆనందం. జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నిరంతరాయంగా సాగిస్తున్న ఉద్యోగయజ్ఞం ఫలితం ఇది.

ప్రతినెలా జాబ్‌మేళా..



ప్రతినెలా ఒక నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహించాలని ప్రభుత్వం జాబ్‌క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఎప్పుడు ఏ నియోజకవర్గంలో నిర్వహించాలన్నది అందులో పొందుపరిచింది. ఇటీవల కాలంలో విజయనగరం జిల్లాలో నిర్వహించిన జాబ్‌మేళాల్లో స్కిల్‌హబ్‌లలో శిక్షణ పొందిన 219 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. నిరుద్యోగుల ఉపాధి కల్పనకు ఇవి చక్కని వేదికలు.

– నీలం గోవిందరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, విజయనగరం

స్కిల్‌హబ్ శిక్షణతోనే ఉద్యోగం



నా పేరు సీహెచ్ సంధ్యారాణి. మాది విజయనగరం. బీఎస్సీ పూర్తిచేసిన వెంటనే విజయనగరం ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న స్కిల్‌హబ్‌లో 45 రోజుల పాటు డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ పొందాను. కంప్యూటర్ నాలెడ్జ్ పెరిగింది. అక్కడే నిర్వహించిన జాబ్ మేళాలో ఎస్.కోటలోని రాజీరామ్ ఎక్స్‌ట్రీమ్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్‌లో నెలకు రూ.15వేల జీతంతో ఉద్యోగం సాధించాను. చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్తులో రాణిస్తానన్న నమ్మకం ఉంది.

ఉద్యోగ ఆనందం



నాపేరు ఆర్.శ్రావణి. కంప్యూటర్ డిప్లొమా చేశాను. అనంతరం స్కిల్‌హబ్‌లో చేరి కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందాను. ఇది ఉద్యోగ సాధనకు దోహదపడింది. ఎస్.కోటలోని రాజీరామ్ ఎక్స్‌ట్రీప్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం సాధించాను. ఉద్యోగంలో రాణించేందుకు ఇక్కడ ఇచ్చిన శిక్షణ దోహదపడుతోంది. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటానన్న నమ్మకం ఉంది.



సీతంపేట ఐటీఐలోని స్కిల్‌హబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

జాబ్‌మేళాలు నిర్వహిస్తున్న కంపెనీలు...

- మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టం
- ఆర్అండ్ఆర్ ఎక్స్‌ట్రీమ్ సొల్యూషన్స్
- డబ్ల్యూఎన్ఎస్
- మారి టెక్
- ఎలమంచిలి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్
- ట్రిజియో టెక్నాలజీస్
- యెకొహమా టైర్స్
- వరుణ్ మోటార్స్
- జయభేరి ఆటోమోటివ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
- కియా మోటార్స్
- ఇసుజు మోటార్స్
- హెచ్‌బీఎల్ పవర్ సిస్టం
- డెక్కన్ ఫైన్ కెమికల్స్
- అలోవెరా యానిమల్ హెల్త్ లిమిటెడ్
- హెటోరో డ్రగ్స్
- దివిస్ లేబరేటరీస్
- అరబిందో ఫార్మా
- ఎస్ఎంఎస్ ఫార్మా
- మైలాన్
- డాక్టర్ రెడ్డీస్
- ఎన్ఎస్ఎల్ టెక్స్ టైల్స్
- ఫ్లిప్ కార్ట్
- నవతా రోడ్ ట్రాన్స్ పోర్ట్
- ఓలం ఆగ్రో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
- అపోలో ఫార్మసీ
- ఎస్‌బీఐ కార్డ్స్
- ఐసీఐసీఐ బ్యాంకు
- శ్రీరంగా మోటార్స్
- క్యాప్‌స్టన్ సర్వీసెస్
- ముత్తూట్ గ్రూప్స్

జగనన్న ముందు చూపుతోనే..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం విద్యార్థుల చదువులు, ఉద్యోగ కల్పనకు చక్కని ఆలోచన చేస్తున్నారు. దీని కోసం నియోజకవర్గానికో స్కిల్‌హబ్ ఏర్పాటుచేశారు. అర్హతే ఆధారంగా వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. నేను ప్రస్తుతం ఆర్ఆర్ ఎక్స్‌ట్రీమ్ సొల్యూషన్స్‌లో ఉద్యోగం సాధించానంటే స్కిల్‌హబ్‌లో శిక్షణ పొందడం వల్లే. కంప్యూటర్ స్కిల్స్ మెరుగుపడ్డాయి. ఇదే శిక్షణ బయట తీసుకోవాలంటే రూ.వేలలో చెల్లించాల్సి వచ్చేది. ఉచితంగా శిక్షణ ఇస్తూ దేశ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగాలు అందిపుచ్చుకునే అవకాశం కల్పిస్తున్న సీఎం ఆలోచనకు హ్యాట్సాప్.

– పారథి చంటి, గుడివాడ

స్కిల్‌హబ్‌లు ఎక్కడెక్కడ నిర్వహిస్తున్నారు..

విజయనగరం జిల్లాలో...

- ప్రభుత్వ బాలికల ఐటీఐ, విజయనగరం
- ప్రభుత్వ ఐటీఐ బొబ్బిలి
- ప్రభుత్వ ఐటీఐ రాజాం
- ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, ఎస్. కోట
- ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, చీపురుపల్లి
- ప్రభుత్వ జూనియర్ కాలేజ్, నెల్లిమర్ల
- ప్రభుత్వ జూనియర్ కాలేజ్, గజపతినగరం
- ఎన్ఏసీ శిక్షణ కేంద్రం, వీటి అగ్రహారం
- ఎన్ఏసీ శిక్షణ కేంద్రం, గిరిజన విశ్వవిద్యాలయం, విజయనగరం

పార్వతీపురం మన్యం జిల్లాలో..

- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పార్వతీపురం
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గుమ్మలక్ష్మీపురం
- ప్రభుత్వ డిగ్రీకళాశాల, సాలూరు
- ప్రభుత్వ ఐటీఐ, సీతంపేట

స్కిల్ హబ్‌లలో నిర్వహిస్తున్న కోర్సులు..

- డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్
- జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్
- సీఆర్ఎం డొమెస్టిక్ నాన్వాయిస్ ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్
- డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్
- ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్
- ఫీల్డ్ టెక్నీషియన్ అండ్ ఎయిర్ కండిషనర్
- అసిస్టెంట్ సర్వేయర్
- ప్లంబర్ జనరల్
- అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్
- ఎలక్ట్రికల్ డొమెస్టిక్ సొల్యూషన్
- ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్
- ప్రొడక్షన్ మెషిన్ ఆపరేటర్



నీటివనరుల సంరక్షణ అందరి బాధ్యత



నీటివనరులు సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

- పీసీబీ పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం

విజయనగరం రూరల్: నీటి వనరుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీరు టి.సుదర్శనం పేర్కొన్నారు. మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని బుచ్చన్న కోనేరులో వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ముందుగా పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సుదర్శనం మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పు కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో నీటి వనరులు కలుషితమవుతున్నాయని, వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యానికి మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. రైతులు సేంద్రియ సాగుకు మొగ్గు చూపాలన్నారు. అనంతరం చెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ కె.తవిటిరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.రామకృష్ణ, మున్సిపల్, పీసీబీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మిషన్ లైఫ్‌పై ప్రచారం

మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని పలు కూడళ్లలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై అవగాహన కల్పిస్తామని పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మయూరి జంక్షన్, బాలాజీ జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ కూడళ్లలో నిర్వహించే కార్యక్రమాల్లో సచివాలయ, పోలీస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు అవకాశం

- వచ్చేనెల 15 నుంచి మండల స్థాయిలో ఎంపికలు
- 22 నుంచి జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు
- సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్

విజయనగరం: కడప జిల్లాలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ శుక్రవారం తెలిపారు. వచ్చేనెల 15 నుంచి 20 వరకు మండల స్థాయిలోను, 22 నుంచి 26వ తేదీ వరకు జిల్లా స్థాయిలో బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని 29, 30 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తామన్నారు. 4వ తరగతిలో ప్రవేశానికి 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు, 5 తరగతిలో ప్రవేశాలకు 9 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని 27 మండలాలు, 4 మున్సిపాలిటీల్లో 3, 4 తరగతుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, విద్యార్థులు తమ ఆధార్‌కార్డుతో పాటు జనన, స్టడీ, నేటివిటీ, ఇన్‌కమ్ సర్టిఫికెట్‌లు సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశ్రమలకు సకాలంలో అనుమతులు

- విద్య, వైద్య సదుపాయాలకు సీఎస్ఆర్ ఫండ్స్
- కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: పరిశ్రమలకు సకాలంలో అనుమతులు జారీ చేయాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు ప్రొత్సాహక మండలి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిశ్రమల కోసం వచ్చిన దరఖాస్తులు ఏ శాఖ వద్ద పెండింగ్ ఉండకూడదన్నారు. నిర్ణీతకాల వ్యవధిలో వాటిని అనుమతించాలని స్పష్టంచేశారు. పరిశ్రమలు, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామిక వాడల స్థాపనకు పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్తవలస, కంటకాపల్లి, బలిఘట్టం, రెల్లి, పెదరావుపల్లి గ్రామాల్లో ప్రతిపాదిత భూములను పరిశీలించి కేటాయించిడానికి క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా వివిధ కంపెనీలు ఖర్చుచేసే సీఎస్ఆర్ నిధులపై చర్చించారు. కార్మికశాఖ, జిల్లా ప్రణాళిక శాఖ, కాలుష్య నియంత్రణమండలి సంస్థ, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్స్, పరిశ్రమలశాఖ ద్వారా ఖర్చు చేసిన నిధులపై ఆరాతీశారు. ఈ నిధులను విద్య, వైద్య సదుపాయాల కల్పనకు వెచ్చించాలని ఆదేశించారు. రూ. 98 లక్షల విలువైన పారిశ్రామిక రాయితీలకు అనుమతించారు. చిన్న సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల స్థాపన కోసం ఎంఎస్ఈ ఆధ్వర్యంలో ప్రతిపాదించిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు ఏర్పాటును పరిశీలించాలని తెలిపారు. సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్, ఆర్డీఓ సూర్యకళ, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి, పరిశ్రమల శాఖ మేనేజర్ పాపారావు, డీడీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రుచిగా.. శుచిగా...

- సర్వజన ఆస్పత్రిలో రుచికరమైన భోజనం వడ్డింపు
- రోగుల డైట్ చార్జీలను రూ.40 నుంచి రూ.80కి పెంచిన ప్రభుత్వం
- ప్రతిరోజూ 300 మందికి భోజనం

విజయనగరం ఫోర్ట్:

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యుల సేవలు అందేలా పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టింది. నాడు-నేడు కింద ఆస్పత్రులకు అదనపు హంగులు అద్దింది. ఆధునిక వైద్యపరికరాలను సమకూర్చింది. తాజాగా రోగుల డైట్ చార్జీలను రూ.40 నుంచి రూ.80కి పెంచి నాణ్యమైన, రుచికరమైన, పోషక విలువలతో కూడిన భోజనం వడ్డిస్తోంది. దీంతో రోగులు సంతోషపడుతున్నారు.

రోజుకి 300 మందికి భోజనం

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోష ఆస్పత్రుల్లో రోజుకి 300 మంది వరకు చికిత్స పొందుతారు. వీరందరికీ ఒక పూట టిఫిన్, రెండు పూటలు భోజనం పెడతారు. దీనికోసం సుమారుగా రోజుకు రూ. 24 వేలు వరకు ప్రభుత్వం ఖర్చుచేస్తోంది. ఈ లెక్కన నెలకు రూ.7.20 లక్షలు, ఏడాదికి రూ. 86.40 లక్షల వరకు భోజనం ఖర్చుకింద వెచ్చిస్తోంది. ప్రతిరోజు భోజనాన్ని ఆర్ఎంఓ తనిఖీ చేసి రుచికరంగా ఉందని నిర్ధారించిన మీదట రోగులకు పెడుతున్నామని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు తెలిపారు. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచడం వల్ల నాణ్యమైన భోజనం రోగులకు పెట్టే అవకాశం కలిగిందన్నారు.



సర్వజన ఆస్పత్రిలో రోగులకు భోజనం పెడుతున్న సిబ్బంది

భోజనం ఇలా...

ఉదయం: ఇడ్లీ, ఉప్మా, పూరీల్లో ఏదో ఒకటి

మధ్యాహ్నం: అన్నం, పప్పు, గుడ్డు, సాంబారు, కూర, మజ్జిగ, అరటి పండు

రాత్రి: అన్నం, పప్పు, సాంబారు, కూర, మజ్జిగ, పెరుగు, అరటి పండు

భోజనం బాగుంది



ఆస్పత్రిలో వడ్డిస్తున్న భోజనం బాగుంది. ఇంటి దగ్గర కంటే మంచి భోజనం పెడుతున్నారు. రుచికరంగా ఉంది. ఇష్టంగా తింటున్నాను.

– కునుకు అప్పలకొండ, గుంకలాం గ్రామం

కొద్దిరోజుల్లో బిల్లుల చెల్లింపు

- అభివృద్ధి పనుల బిల్లులన్నీ అప్‌లోడ్ చేయాలి
- అధికారులకు సూచించిన జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం:

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులన్నీ అప్‌లోడ్ చేసేందుకు సిద్ధం చేయాలని అధికారులకు జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. కొద్దిరోజుల్లో ప్రభు త్వం పెండింగ్ బిల్లులు చెల్లించనుందన్నారు. నెల్లిమర్ల, చీపురుపల్లి, గజపతినగరం, బొబ్బిలి, ఎస్. కోట, విజయనగరం నియోజకవర్గాల్లో గ్రామీణ ఉపాధిహామీ పథకం కన్వర్జెన్సీ నిధులతో జరుగుతున్న ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, ఇతర నిర్మాణాల పెండింగ్ బిల్లులపై జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఉపాధి హామీ పథకం కింద కన్వర్జెన్సీ నిధులతో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతా పనులను చేపట్టినట్టు వెల్లడించారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, నీటి పారుదల శాఖలకు సంబంధించిన పనులను కూడా నిర్వహించారన్నారు. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే సుమారు రూ.38 కోట్ల బిల్లులను అప్‌లోడ్ చేయడం పూర్తి అయ్యిందని చెప్పారు. మరో రూ.7 కోట్ల పనులకు సంబంధించిన బిల్లులు అప్లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఎంసీసీ, డీసీసీ స్థాయిలో ఎక్కడా బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. వీటికి సంబంధించిన సాంకేతిక సమస్యలపై చర్చించారు. 24 గంటల్లో బిల్లులన్నీ అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ఎం.అశోక్‌కుమార్, డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్, పంచాయతీరాజ్ ఎస్ఈ బీఎస్ఆర్ గుప్త, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓలు, ఉపాధిహామీ ఏపీఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



హాజరైన అధికారులు

క్లుప్తంగా

రెండు నెలల్లో ఇళ్లు పూర్తి చేయాలి

● అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మంజూరు చేసిన ఇళ్లలో వచ్చే రెండు నెలల్లోగా 6,086 గృహాలను పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సామూహిక గృహ ప్రవేశానికి సంబంధించి ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని జూన్, జూలై నెలల్లో పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో సామూహిక గృహప్రవేశం లక్ష్యంగా 30 వేల ఇళ్లను నిర్దేశించగా ఇప్పటికే పూర్తి చేశామన్నారు. గృహ నిర్మాణంపై కలెక్టర్ శుక్రవారం మండలస్థాయి, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి వారంలో 750 నుంచి 800 ఇళ్లు పూర్తి చేయాలని చెప్పారు. సచివాలయం వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ పీడీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే వెల్ఫేర్ డే



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

విజయనగరం క్రైమ్: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఎస్పీ ఎం.దీపిక దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లాలో పనిచేస్తున్న కానిస్టేబుల్స్, అధికారులు పాల్గొన్నారు.

పే అండ్ అకౌంట్స్ కార్యాలయం పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న మల్లేశ్వర రావు

విజయనగరం ఫోర్ట్: పే అండ్ అకౌంట్స్ కార్యాలయాన్ని డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ సీహెచ్‌కే మల్లేశ్వర రావు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా బిల్లుల చెల్లింపు, ఇతర అంశాలను తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. క్రమశిక్షణ, అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ఎం.రామసుబ్బయ్య, జేపీపీఓ పి. బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సతీష్‌కుమార్

గరుగుబిల్లి: బలిజిపేట మండలంలోని బర్లి గ్రామానికి చెందిన బి.సతీష్ కుమార్ బాత్ రూమ్ కడిగే ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. సతీష్‌కుమార్ అక్క వావిలపల్లి నాగమణిని 14ఏళ్ల క్రితం భర్త సూర్యనారాయణ వదలి వెళ్లిపోయాడు. ఆరు నెలల క్రితం ఆయన వేరే వివాహం చేసుకుని గ్రామానికి వచ్చాడు. దీనిపై బావను నిలదీసిన సతీష్‌కుమార్‌కు అక్క మద్దతు తెలియజేయకుండా భర్తను వెనుకేసుకు రావడంతో తమ్ముడు మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో బాత్‌రూంశుభ్రం చేసే ద్రావణాన్ని తాగేశాడు. విషయం గమనించి కుటుంబ సభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 485.00
శ్రీకాకుళం	రూ. 485.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,000–00
బంగారం(22కి. 10గ్రా.)	61,100–00
వెండి (కిలో)	78,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹ 280

సాహితీ వేత్తలకు వందనం

● వందమంది కవులకు సత్కారం
● 28న రారవే సాహితీ సంబరం



రాజాం రచయితలవేదిక సింబల్



రారవే పుస్తకావిష్కరణలో మండలి బుద్ధప్రసాద్

రాజాం: ఒక అక్షరం అనంత విశ్వానికి వెలుగు. ఒక ప్రయత్నం కోట్ల ఫలితాలకు తొలిమెట్టు. అలానే చిన్నపాటి ఆలోచన..శత సాహితీ మాసోత్సవాల కార్యక్రమానికి వారధిగా నిలిచింది. ఎంతో మంది సీనియర్ సాహితీవేత్తలతో ప్రముఖల రచనలపై విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రతినెలా సాహితీ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించింది. పదుల సంఖ్యలో కొత్త యువ రచయితలు, సాహితీవేత్తలను సమాజానికి పరిచయం చేసింది. నిర్విరామంగా ఎనిమిదేళ్ల పాటు ప్రతినెలా సాహితీ కార్యక్రమాలతో ముందుకు నడిచిన రాజాం రచయితల వేదిక(రారవే) ఈనెల 28 న వందవ మాసోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ మేరకు నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంతింతై..వటుడింతై అన్నట్లు

జనవరి 25, 2015లో ఏర్పడిన రాజాం రచయితల వేదిక అప్పట్లో రాజాం పట్టణానికి చెందిన హైస్కూల్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గార రంగనాథం ఆలోచనతో ప్రారంభమైంది. రాజాంలో విద్యానికేతన్ వేదికగా పది మంది సాహితీవేత్తలు, రచయితలతో ప్రారంభమైన ఈ వేదిక అనతికాలంలోనే రాజాంతో పాటు విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన ప్రముఖ సాహితీవేత్తల దృష్టిని ఆకర్షించింది. ప్రతి నెలా చివరి ఆదివారం రచయితలు, సాహితీవేత్తలు, కొత్తగా సమాజంలో అడుగుపెడుతున్న కవులతో సమావేశం జరుగుతుంది. ఒక అంశాన్ని, రచనను, గ్రంథాన్ని, పుస్తకాన్ని ఇలా ఏదో ఒక సాహితీ అంశంపై ఆ సమావేశంలో ప్రధాన వక్త పరిచయ కార్యక్రమం చేస్తే మిగిలిన సాహితీ వేత్తలు, రచయితల ఆ అంశంపై వారి అభిప్రాయాలను విమర్శ, ప్రతి విమర్శ రూపంలో వెల్లడిస్తారు. లోపాలపై ప్రస్తావిస్తారు. గొప్పతనాన్ని ప్రశంసిస్తారు. సమాజానికి అందులోని ముఖ్య సందేశాన్ని వివరిస్తారు. రోజంతా సాహితీ వనంలో వందలాదిమంది తేలియాడతారు. కోవిడ్ సమయంలో కూడా ఈ సాహితీ కార్యకలాపాలు ఆన్‌లైన్ ద్వారా జరిగాయి. ఇలా ప్రతి నెలా కార్యక్రమాన్ని దిగ్విజయంగా నడిపిన రారవే ఈనెల 28 న వందవ సాహితీ సమ్మేళనాన్ని శతసాహితీ సమావేశ సంబరం పేరుతో నిర్వహిస్తోంది.



రారవే సాహితీ సమావేశంలో విశాఖ బీవీకే కళాశాల రిటైర్డ్ తెలుగు ఆచార్యులు దామెర వెంకటసూర్యా రావు

సాహితీవేత్తల సమ్మేళనం

రాజాం రచయితల వేదిక సాహితీ సమ్మేళనంలో ఎంతోమంది సాహితీవేత్తలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొన్నారు. మాజీ ఉపశాసన సభాపతి మండలి బుద్ధప్రసాద్, దీర్ఘాశి విజయభాస్కర్, గుంటూరు లక్ష్మీనరసయ్య, తుర్లపాటి రాజేశ్వరి, దామెర వెంకటసూర్యారావు, అట్టాడ అప్పలనాయుడు, గంట్యాడ గౌరునాయుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు నారంశెట్టి ఉమామహేశ్వర రావు, బాల సుధాకర్ మౌళి, మేడూరి సూర్యసత్యనారాయణ, మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు, పద్మశ్రీ యడ్ల గోపాలరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలు, రచనలు పరిచయంచేశారు. పండితుడు, కవి, రచయిత, విమర్శకుడైన గార రంగనాథం నిర్వహిస్తున్న రారవే ప్రశంసలు అందుకుంటోంది.



గుంటూరులో రారవే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ విద్యాశాఖ మాజీ కమిషనర్ వాడరేవు చినభద్రుడు



రారవే నిర్వాహకులను సన్మానిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ కూన రామ్‌జీ(ఫైల్)

సాహిత్యంపై అభిరుచితో...



తెలుగు భాష చాలా గొప్పది. ఉత్తరాంధ్రలో చాలా మంది కవులు, రచయితలు, సాహితీవేత్తలు ఉన్నారు. వారిని సమాజానికి పరిచయం చేయాలన్నదే నా సంకల్పం. అందులో భాగంగానే ప్రతి నెలా రారవే నిర్వహిస్తున్నాం. ఎంతో మంది సాహితీవేత్తలు, రాజాం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వక్తలు, రచయితలు సహకరిస్తున్నారు. తెలుగు పండిట్‌గా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసిన నాకు తెలుగు సాహిత్యంపై అభిరుచి ఎక్కువ. రాజాంలో స్థిర నివాసిగా ఉండడంతో పాటు హెచ్‌ఎంగా పదవీ విరమణ అనంతరం రారవే స్థాపించి సాహితీసేవలను సమాజానికి అందిస్తున్నాం.

గార రంగనాథం, రారవే నిర్వాహకులు, రాజాం

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



దేవరాపల్లి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న ఎస్సై రాజేష్



గుర్ల: సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లతో ఎస్సై హరిబాబు నాయుడు

వేపాడ: మండలంలోని దేవరాపల్లి నుంచి వేపాడ వస్తున్న ఇసుక ట్రాక్టర్‌కు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో పట్టుకుని సీజ్‌చేసినట్లు వల్లంపూడి ఎస్సై రాజేష్ శుక్రవారం తెలిపారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి నుంచి వేపాడ వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గురువారం రాత్రి పట్టుకుని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గరికివలసలో మరో రెండు ట్రాక్టర్లు..

గుర్ల: మండలంలోని గరికివలసలో గల చంపావతి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్సై హరిబాబునాయుడు శుక్రవారం పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇసుకను గ్రామ శివారులో నిల్వ చేశారని సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తుకెళ్లడంతో బోసిగా మిగిలిన విద్యుత్ స్తంభాలు

వీరఘట్టం: మండలంలోని మహదేవివలస గ్రామ పంట పొలాల్లో ఉన్న 16 కేవీ సామర్థ్యం గల త్రీ-ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి దొంగిలించారు. గ్రామానికి చెందిన సభినాన వెంకటనాయుడు పొలంలో ఉన్న ఈ ట్రాన్స్ ఫార్మర్ ద్వారా పంట పొలాల్లో ఉన్న మోటార్లకు సాగునీరు అందిస్తున్నారు. సుమారు రూ.1.50 లక్షల విలువ గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎవరో విద్యుత్ పనులు తెలిసిన వ్యక్తులే ఎత్తుకెళ్లి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. సంబంధిత రైతు ఇచ్చిన సమాచారం మేరకు ఏఈ డి.బాలాజీ శుక్రవారం వీరఘట్టం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నెల రోజుల క్రితం కూడా చిట్టపులివలస జంక్షన్ వద్ద ఉన్న 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే విలువైన రాగిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. నెల రోజుల వ్యవధిలోనే విద్యుత్ సరఫరా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కరెంట్ కట్ చేసి ట్రాన్స్‌ఫార్మర్ దొంగిలించారంటే ఇది విద్యుత్ పనులు తెలిసిన ముఠా పనేనని పోలీసులు అనుమానంవ్యక్తం చేస్తున్నారు.

29న జగనన్నకు చెబుదాం

పార్వతీపురం: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రతి సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ఈనెల 29న కలెక్టరేట్ దిగువ సెల్లార్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఆర్‌ఓ జె.వెంకట్రావు శుక్రవారం తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే జిల్లా అధికారులు, అర్జీదారులు ఈ విషయం గమనించాలని కోరారు.

మాతా, శిశు మరణాలను అరికట్టాలి

● కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం జరిగే వరకు నిత్యం పర్యవేక్షించాలని తద్వారా మాతా, శిశు మరణాలను అరికట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. అవసరమైన పరీక్షలు చేయడం, మందులు వాడవలసి ఉంటే వారి కుటుంబ సభ్యులకు కూడా తెలియజేయాలని సూచించారు. తల్లీబిడ్డలు సురక్షితంగా ఉండేలా వైద్యాధికారులు, ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా భావించాలని చెప్పారు. తన చాంబర్‌లో శుక్రవారం మాతా, శిశు మరణాలపై కేసుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఏప్రిల్, మే నెలలో రెండు మాతృ మరణాలు, 6 శిశు మరణాలు సంభవించాయని డీఎంహెచ్‌ఓ రమణకుమారి వివరించారు. ఏఒక్క గర్భిణి, శిశువు వైద్యం అందని కారణంగా మరణించరాదన్నారు. ఘోషాఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు రిఫర్ చేసిన కేసులపై ఆరా తీశారు. ఇక్కడ లేనిది కేజీహెచ్‌లో ఉండేది ఏమిటని ఘోషాఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ అరుణకుమారిని ప్రశ్నించారు. చిన్న పిల్లల కోసం వెంటిలేటర్ ఇక్కడ లేనందున అక్కడికి రిఫర్ చేశామని ఆమె తెలిపారు. హైరిస్క్ ఉన్న వారి పట్ల ప్రత్యేక దృష్టి సారించి, వారి కుటుంబ సభ్యులను అప్రమత్తంగా చేయాలని సూచించారు. ప్రతి మరణం నుంచి ఎంతో కొంత నేరుకోవాలని, అప్పుడే తదుపరి కేసులో ఎలాంటి తప్పిదం జరగకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ చుక్క శ్రీకాంత్, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల చించివేత



సీఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సీసీ టీవీ ఫుటేజ్‌లో కనిపిస్తున్న ఫ్లెక్సీలు చించివేస్తున్న దుండగుల చిత్రాలు

సాలూరు: పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే యుద్ధం అనే పేరుతో పట్టణంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన వైఎస్సార్‌సీపీకి చెందిన భారీ ఫ్లెక్సీలను పలువురు దుండగులు గురువారం రాత్రి చించివేశారు. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు జర్జాపు సూరిబాబు, గిరిరఘు తదితరుల ఆధ్వర్యంలో పట్టణ సీఐ శ్రీనివాస రావును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.

గుండె పోటుతో వలంటీర్ మృతి



వలంటీర్ రాపాక సత్యం(ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని దాసుపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో వలంటీర్ రాపాక సత్యం(27)మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు, పక్క గ్రామమైన లింగాలవలసలో యువకులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా సత్యం ఒక్కసారిగి కిందపడి అపస్మారక స్థితికి చేరుకోవడంతో వెంటనే సమీపంలో ఉన్న గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఒకగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు.

ఎండ బారిన పడి వృద్ధుడు..




ఎండతీవ్రతతో మృతి చెందిన జగ్గారావు

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామ పంచాయతీ పరిధి అయ్యన్న అగ్రహారం గ్రామానికి సమీపంలో ఎండ తీవ్రతతో పాటు బీపీ, సుగర్ కారణంగా ఓ వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం నందాం గ్రామానికి చెందిన రొంగలి జగ్గారావు(62) జాతరలు జరిగే ప్రాంతాలకు వెళ్లి బూరలతో పాటు ఇతర ఆట వస్తువులను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అంబటివలస గ్రామంలో జరుగుతున్న పండగకు వచ్చి ఆటవస్తువులు విక్రయించుకుని ఇంటికి అడ్డదారిలో వెళ్తున్న క్రమంలో మృత్యువాత పడ్డాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీ: డిప్యూటీ తహసీల్దార్‌కు గాయాలు



పార్వతీపురం: చికిత్సపొందుతున్న క్షతగాత్రులు



సీతానగరం: అచ్యుతరావుకు చికిత్స చేస్తున్న డాక్టర్ ఉషారాణి

బొండపల్లి: విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రౌతు శంకర్రావును మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో శుక్రవారం ఆయన తీవ్ర గాయాల పాలయ్యారు. గాయ పడిన డీటీని విజయనగరం ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

ఆటో బోల్తాపడి మరో ఇద్దరికి..

పార్వతీపురం/కొమరాడ: కొమరాడ మండలం చోళ్లపదం పంచాయతీ రెబ్బ గ్రామానికి చెందిన వి.సీతారాంతో పాటు పలువురు వ్యక్తిగత పనుల నిమిత్తం చినమేరంగి శుక్రవారం ఆటోలో వెళ్లారు. చినమేరంగి నుంచి తిరుగు ప్రయాణంలో మాదలింగి, తొడుము గ్రామం మధ్యలో మలుపువద్ద ఆటో బోల్తాపడడంతో సీతారాంతో పాటు హిమరిక శంకరరావుకు పలుచోట్ల గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను కారు ఢీకొని వ్యక్తికి..

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై చినభోగిలి వద్ద టీవీఎస్ వాహనంపై వస్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. బూర్జ గ్రామానికి చెందిన ఎస్ అచ్యుతరావు చినభోగిలి పెట్రోల్ బంకులో తన టీవీఎస్ బండికి పెట్రోలు వేయించుకుని సీతానగరం వస్తుండగా సీతానగరం నుంచి బొబ్బిలి వెళ్తున్న కారు అదుపుతప్పి ఢీకొట్టడంతో అచ్యుతరావుకు గాయాలయ్యాయి. గాయాలపాలైన వ్యక్తిని పార్వతీపురం మన్య జిల్లా కేంద్రాసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

దత్తిరాజేరు: మండలంలోని చినకాద ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామానికి చెందిన గేదెల అప్పలనాయుడు మరి కొంత మంది జిల్లా గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేయడంతో ఏపీడీ జనార్దన్, ఏపీఓ సత్యవతి శుక్రవారం విచారణ చేశారు. ఈ మేరకు గ్రామ సచివాలయంలో ఫిర్యాదుదారులు, క్షేత్ర సహాయకురాలు, గ్రామ పెద్దల సమక్షంలో విచారణ చేసిన సందర్భంగా గ్రామంలో లేని వారికి మస్తర్లు వేశారని, అలాగే వేతన దారుల వద్ద నగదు వసూలు చేశారన్న ఫిర్యాదుపై వేతన దారులను విచారణచేయగా నగదు వసూలు చేయలేదని అధికారుల ముందు చెప్పారు. ఆమె తల్లిదండ్రులు పనికిరాకుండా క్షేత్ర సహాయకురాలు మస్తర్లు వేసినట్లు కొంతమంది వేతనదారులు ఆరోపించారు. తనపై కక్ష సాధింపు కోసం కొంత మంది తప్పుడు ఫిర్యాదు చేశారని క్షేత్ర సహాయకురాలు రామలక్ష్మి విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. విచారణలో సేకరించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏపీడీ చెప్పారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ దీపికా పాటిల్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఎం.దీపికాపాటిల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, సీడీ ఫైల్స్, స్టేషన్ ఆవరణ, లాకప్ గదులు, ప్రాపర్టీని పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బంది ప్రవర్తన, స్టేషన్‌కు వచ్చిన వారితో ఎలా ఉండాలనే విషయమై పలు సూచనలు చేశారు. రాత్రి సమయాలలో గస్తీ పెంచాలని, గ్రామ సందర్శన ముమ్మరం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్, సీఐ ఎల్.అప్పలనాయుడు, పెదమానాపురం ఎస్సై శిరీష పాల్గొన్నారు.

ఖాతాదారులందరూ పాలకవర్గ సభ్యులే

● ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాఘవేంద్రరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరావు

విజయనగరం ఫోర్ట్: బ్యాంకులో ఉన్న ఖాతాదారులందరూ పాలకవర్గ సభ్యులేనని ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు పేర్కొన్నారు. పూల్‌బాగ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన బ్యాంక్ మహాజన సభలో ఆయన మాట్లాడుతూ రూ.42.81 కోట్ల రుణాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ వ్యాపార సంస్థలా కాకుండా ప్రజల సంస్థగా భావించాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గుడివాడ భాస్కర రావు, బ్రాంచ్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రసాదరావు, డైరెక్టర్లు భవాని, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ ONE SITTING: 10th, 12th, B.A, B.Com., B.Sc., M.A., M.Com, M.Sc, B.Ed, BBA, BCA, MBA, MCA, Nursing, Pharmacy, Dip in Vet, B.Tech., from Recog. University in India (for Discontinued) ✆ : 73383 76874 [R-05]

PLOT FOR SALE

■ విజయనగరం 100sft రింగ్ రోడ్ సమీపంలో గాయత్రి నగర్ లేఅవుట్ నందు 239 చ॥గ॥ నార్త్ ఫేసింగ్ బిట్ అమ్మకమునకు కలదు. సం॥ సెల్: 8802889988,9666989234. [C-785751]

HOUSE FOR SALE

■ విజయనగరం, దాసన్నపేట, గొల్లవీధి సచివాలయం దగ్గరలో పాత పెంకుటిల్లు అమ్మకానికి కలదు. సెల్ : 9618335369. [S-1195845]

WANTED

■ Wanted Teachers Telugu, English, Hindi, Biology Teachers For High School. Cont : 9502869067, 9440541974. [S-1195843]

■ అతి తక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 77308 99503 [G-587]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000– 20,000/– వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర: 93460 32628 [G-786352]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7995374999 [HA-208]

■ హైదరాబాద్ 5స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ & గర్ల్స్, హెల్పర్స్,సె॥గార్డ్స్, సూ॥వైజర్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ. 15000-30000. ఫోన్:7981515640,9989930582. [H-781313]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786367]

■ E.G.P. School నందు పనిచేయుటకు అనుభవం కల్గిన టీచర్స్ (ఫ్యామిలీ) మరియు వంటచేయుటకు (ఫ్యామిలీ) కావలెను. ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించబడును. కుంటినవలస, మెంటాడ (మం), VZM (Dist.). 9985693480, 8555024880. [C-785760]

■ ఫ్రాంచైజ్ ఆఫర్ (పెట్టుబడి లేదు) మార్కెటింగ్ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి మాత్రమే ఫ్రాంచైజ్ ఇవ్వబడును. Mega Group Man Power & Security. Cont : 7032610569, 7093125169. [NA-5635]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.